క్లుప్తంగా

చిన్నారులకు ప్రీస్కూల్ కిట్ల పంపిణీ



ప్రీస్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ చాముండేశ్వరి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆచారమ్మకొట్టాల, మోదినాబాద్, బర్మశాల ఏరియాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీస్కూల్ కిట్లను అందజేశారు. శనివారం ఆయా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో వార్డు కౌన్సిలర్‌లు చాముండేశ్వరి, కుమారి, వార్డు ఇన్‌చార్జ్ పరుశురాముడు చేతుల మీదుగా కిట్లను అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రామాలయం వీధి, వంక గడ్డ వీధి, ఎస్ఎస్ పల్లి, గుత్తిలోని కోట, జెండావీధి, బండగేరి, చాకలి గేరి , చెర్లోపల్లి కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి,, సీడీపీఓ డిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, కౌన్సిలర్లు శనివారం అంగన్‌వాడీ పిల్లలకు జగనన్న ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కేసీ నారాయణకు ఘన నివాళి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గుంతకల్లు రూరల్: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కేసీ నారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటం వద్ద ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీనాథ్‌గౌడ్, డాక్టర్ హిమబిందు, వెంకటశివుడు యాదవ్, తదితరులు తరలి వచ్చి కేసీ నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కేసీ నారాయణ చిరస్మరణీయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా స్థానిక ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి అర్బన్: నంద్యాల రోడ్డులోని సుంకులమ్మ దేవాలయం ఆర్చ్ వద్ద మట్కా రాస్తున్న రామాంజులరెడ్డిని శనివారం అరెస్ట్ చేసినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి మట్కాచీటీలతోపాటు రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మటన్ మార్కెట్ అభివృద్ధికి చర్యలు



వ్యాపారులతో చర్చిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పాతబస్టాండ్‌లో ఉన్న మటన్ మార్కెట్ అభివృద్ధికి చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. శనివారం కమిషనర్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మటన్ మార్కెట్‌ను పరిశీలించారు. నీటి, విద్యుత్ సౌకర్యంతో పాటు మేకలు, పొట్టేళ్లను వధించడానికి ఇక్కడే తగు ఏర్పాట్లను చేయాలని వ్యాపారులు కమిషనర్‌ను కోరారు. మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. మాంసపు వ్యర్థాలను ఎక్కడపడితే పడేయొద్దని కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపల్ టీపీఎస్ అబ్దుల్ సత్తార్, డీఈ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న అర్బన్ సీఐ హమీద్‌ఖాన్


తాడిపత్రి అర్బన్: పేదలకు వాసవీ క్లబ్ సేవలు అందిస్తున్న ప్రశంసనీయమని తాడిపత్రి అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక ఆర్వీస్వామి కళ్యాణమండపంలో వాసవీ క్లబ్ అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీఐ హమీద్‌ఖాన్ ప్రారంభించారు. శిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 200 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్రనాథ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కందుకూరి సుబ్బరామయ్య, టీసీసీ చైర్మన్ శివకుమార్, జిల్లా రీజినల్ సెక్రటరీ శ్యాంప్రసాద్, పెద్ద మద్దిలేటి, వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి సుబ్బరత్నమయ్య పాల్గొన్నారు.

తండ్రి కోసం వచ్చి.. ప్రజాసేవలో నిమగ్నమై..

యాడికి : ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో నివసిస్తున్న బాల కుళ్లాయప్ప కుమారుడు కుళ్లాయిస్వామి. ఇతడు ఎంబీఏ వరకు చదువుకుని హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. తల్లి చిన్నప్పుడే మృతి చెందటంతో దివ్యాంగుడైన తండ్రి బాగోగులు చూసేందుకు తన ఉద్యోగం వదిలి స్వగ్రామానికి వచ్చాడు. అదే సమయంలో జగనన్న ప్రభుత్వం వలంటీర్‌గా పనిచేసే అవకాశం కల్పించడంతో యాడికి నం:1 గ్రామ సచివాలయంలో విధుల్లో చేరాడు. యాడికిలో కరోనా ఉధృతంగా ఉన్నప్పుడు తనకు కేటాయించిన 50 కుటుంబాల వారికి నేనున్నానంటూ ధైర్యం చెప్పాడు. వారికి అవసరమైన నిత్యావసరాలు, మందులు అందించి బాగోగులు చూసుకున్నాడు. దీంతో ప్రజలు ఇప్పటికీ అతని సేవలు గుర్తు చేసుకుంటున్నారు.



కరోనా సమయంలో చేనేత పింఛన్ అందిస్తున్న వలంటీర్ కుళ్లాయిస్వామి



వలంటీర్‌ను మరువం



ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే మా ఇంటికి వలంటీర్ కుళ్లాయి స్వామి వచ్చి నాకు చేనేత పింఛన్ రూ 2,750 ఇస్తున్నాడు. గతంలో కరోనా వచ్చినపుడు మా బాగోగులు చూసేవాడు. కాలనీలో ఎవరికైనా ఏ సమస్య ఉన్న వలంటీర్‌కు చెబితే మరుసటి రోజే మా సమస్యలు తీర్చుతున్నాడు. మా బాగోగులు చూస్తున్న వలంటర్‌ను ఎప్పటికీ మరువం.

– అంజనేయులు, చేనేతపింఛన్‌దారుడు, యాడికి

విద్యార్థుల భవిష్యత్తుకు జగనన్న బంగారు బాట

గుంతకల్లుటౌన్: విద్యారంగంలో సంస్కరణల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 54వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది ప్రముఖులను తీర్చిదిద్దిన ఘనత ఎస్‌కేపీ ప్రభుత్వ కళాశాలదేనన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని చెప్పారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ఏపీ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. విద్యార్థులు కష్టపడి ఓ మంచి లక్ష్యంతో చదివితే వారి బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలో కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కళాశాలకు న్యాక్ ఎ-గ్రేడ్ రావడానికి కృషి చేసిన అధ్యాపకులను ఎమ్మెల్యే అభినందించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

గుత్తి: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని హెచ్ఎం సుబహాన్ పేర్కొన్నారు. పట్టణంలోని కోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు శామ్యూల్ ప్రతాప్, దేశాయి నాగరాజు, శేషాద్రి, శ్రీనివాసులు, రఘు, రఘురాం, పులికొండ, లింగన్న పాల్గొన్నారు.

ధర్మాపురంలో ఇరువర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: ధర్మాపురంలో చిన్నపాటి విషయంపై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు...మూడు రోజుల క్రితం పామిడిలో శరత్, కిరణ్ అనే యువకులు ఘర్షణ పడ్డారు. అయితే శరత్ తన స్నేహితుడైన ధర్మాపురం గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు సాయికుమార్‌కు ఫోన్ చేసి కిరణ్‌తో గొడవ జరిగింది తనకు మద్దతుగా రావాలని కోరాడు. సాయికుమార్ పామిడికి వెళ్లి కిరణ్‌తో గొడవ పడ్డారు. అది మనసులో పెట్టుకున్న కిరణ్, తల్లిదండ్రులు సాయికుమార్‌తో శుక్రవారం అర్ధరాత్రి వరకూ ఫోన్‌లో వాదులాడారు. శరత్‌కు మద్దతుగా నువ్వెలా వస్తావని సాయికుమార్‌తో గొడవపడ్డారు. చేతనైతే ధర్మాపురం రండి చూసుకుందాని సాయికుమార్ చెప్పాడు. దీంతో కిరణ్, తన తండ్రి వెంకటప్ప, స్నేహితులతో కలిసి అర్ధరాత్రి ధర్మాపురం వచ్చి గొడవకు దిగాడు. మాటామాటా పెరిగి సహనం కోల్పోయిన సాయికుమార్ వెంకటప్ప తలపై బండరాయితో మోదాడు. తీవ్ర రక్త స్రావంతో అపస్మారక స్థితిలో ఉన్న వెంకటప్పను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. వెంకటప్పపై దాడి చేసిన సాయికుమార్ శనివారం ఉదయం పోలీసుల వద్దకు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం

యాడికి: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమని సర్పంచు అనూరాధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నం:2 , నం:4 గ్రామ సచివాలయాల వద్ద ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 1,106 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డీటీ బాలమ్మ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యుడు తిరుపతి, సచివాలయాల కార్యదర్శులు రాం సతీష్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

పామిడి: పట్టణ అంబేడ్కర్‌కాలనీ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, పార్టీ పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, వార్డు ఇన్‌ఛార్జ్‌లు సీ అబ్దుల్‌రజాక్, ఈశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్లు శివ, సూరి, ఓబులేసు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారం భించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పి.ఎర్రగుడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 3,400 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. సర్పంచ్ మోటా పాపన్న, వైఎస్సార్‌సీపీ నేత శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శింగనమల: తరిమెల గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, తహసీల్దార్ ఈశ్వరమ్మ పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. సర్పంచ్ ఓబిలేసు, ఎంపీఈసీ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచిరెడ్డి భాస్కరెడ్డి, రైతు విభాగపు అధ్యక్షులు ఎస్వీ నారాయణ, నాయకులు బాలిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: నరసాపురం సచివాలయంలో శనివారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ రామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషా, సెక్రటరీ లవకుమార్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రావులుడికి, మేడిమాకులపల్లి గ్రామ సచివాలయాల వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డీటీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ రంగేశ్వరెడ్డి, ఈఓపీఆర్‌డీ నాగేశ్వర శాస్త్రి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆర్ఐ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలో ఈ నెల 1న ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ముగిసింది. ఎల్లుట్ల, మడుగుపల్లి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి జెడ్పీటీసీ సువర్ణ ముఖ్య అతిథిగా హాజరై ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల: నార్పల-1,గూగూడు సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు690 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, ఎంపీటీసీ రాజారెడ్డి, తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంఈఓ క్రిష్ణయ్య, ఈఓఆర్డీ లక్ష్మినరసింహ, ఏపీఎం తిప్పమ్మ, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థనాయుడు, శ్రీనివాసులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నార్పలలో సర్టిఫికెట్ ఇస్తున్న అధికారులు, నాయకులు, గుత్తిలో సర్టిఫికెట్ ఇస్తున్న ఎంపీపీ విశాలాక్షి

మణిపూర్ ఘటనలో దోషులను ఉరితీయాలి

గుంతకల్లుటౌన్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన దోషులను ఉరితీయాలని ఏపీ సంచార జాతుల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరాదేవి డిమాండ్ చేశారు. శనివారం మణిపూర్ ఘటనను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. మణిపూర్‌లో ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కూడా కఠినంగా వ్యవహరించాలన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరారు. సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, నేతలు జానకి, రత్న, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పంటల సాగులో మెలకువలు అవసరం

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో మెలకువలు పాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం చెర్లోపల్లిలో రెడ్డిపల్లి కేవీకే, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన పంటల సాగుపై అవగాహన సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ పంటల సాగు సమయంలో రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించు కోవాలన్నారు. వాటి ఫలితాల ఆధారంగా మందులు వాడుకోవచ్చన్నారు. రైతులు పెట్టుబడులు తగ్గించే దశగా ఆలోచించాలన్నారు. పొలాల్లో నీటి నిల్వ కోసం ఇంకుడు గుంతలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగులో మెలుకువలుతో కూడిన పుస్తకాలు, ధ్రువ పత్రాలను అందజేశారు. డ్వామా అధికారి భాస్కర్, కేవీకే శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ కిషోర్‌రెడ్డి, చెర్లోపల్లి, వెంగళమ్మ చెరువు, మంతలపల్లి, అమగొండపాలెం రైతులు పాల్గొన్నారు.



రైతులకు ధ్రుపత్రాలను అందజేస్తున్న డాక్టర్ మల్లేశ్వరి

పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించండి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆమె ఎంపీపీ సునీతతో కలిసి స్థానిక ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఎంత మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఎస్సీ హాస్టల్ వార్డెన్ రామునాయక్, ఎస్టీ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ సునీత

పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకస్మిక మృతి

గుత్తి రూరల్: బసినేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రంగనాయకులు(40) ఆకస్మికంగా మృతి చెందాడు. శనివారం ఉదయం ఉన్నఫళంగా గుండె నొప్పి వస్తోందని కుప్పకూలి కింద పడి మరణించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువ నేత, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి రంగనాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయాల రూరల్ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, ఉప సర్పంచ్ హనుమంతు, నాయకులు సుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, కౌన్సిలర్ వరదరాజులు ఉన్నారు.



రంగనాయకులు(ఫైల్)

వైభవంగా ఏడు శనివారాల వ్రతం

తాడిపత్రి అర్బన్: లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాన్ని శనివారం పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో వైభవంగా ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీ బట్టార్ నేతృత్వంలో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. ఈసందర్భంగా ఆలయంలోని ప్రధాన ఆది దేవతలైన లక్ష్మీ సహిత చింతల వెంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలకు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఏడు శనివారాల వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చింతలరాయుడి సన్నిధిలో డీఆర్ఎం

తాడిపత్రి అర్బన్: గుంతకల్లు డీఆర్ఎం వెంకటరమణారెడ్డి కుటుంబ సమేతంగా శనివారం చింతల వెంకటరమణస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం డీఆర్ఎం గర్భాలయంలోని చింతల వెంకటరమణస్వామి, ఆనంద వల్లి నాయకి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కుటుంబ సభ్యులను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు స్వామి శేషవస్త్రంతో పాటు తీర్థ ప్రసాదాలను, చిత్రపటాలను అందజేశారు. డీఆర్ఎం దంపతులు ఆలయంలోని శిల్పకళ, ఆలయ ప్రాశస్త్యాన్ని అర్చకులు మురళీబట్టార్‌ను అడిగి తెలుసుకున్నారు.



వెంకటరమణారెడ్డికు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న నాగేశ్వర్‌రెడ్డి

నాటుసారా స్వాధీనం

తాడిపత్రి అర్బన్: నాటుసారా తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. శనివారం స్థానిక శివాలయం వీదిలో వాహనాల తనిఖీ చేస్తుండగా నంద్యాల రోడ్డు వైపు నుంచి బైక్‌లపై వచ్చిన 8 మందిని ఆపి తనిఖీ చేయగా నాటుసారా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇందులో నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోగా సతీష్‌కుమార్, కంతా రవికుమార్, ఇమామ్, సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో వారు మట్కా నిర్వహిస్తున్నట్లు తేలడంతో మట్కాచీటీలతోపాటు రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఎద్దు దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: చెట్నేపల్లిలో శనివారం వెంకటరాముడు అనే వ్యక్తిపై ఎద్దు పొడిచింది. వెంకటరాముడు ఎద్దును కట్టేస్తున్న సందర్భంలో ఉన్న ఫళంగా ఎద్దు అతనిపై తిరగబడి పొడిచింది. తీవ్రంగా గాయపడిన వెంకటరాముడును గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



గాయపడిన వెంకటరాముడు

మదాసి కురుబ సమితి అడహాక్ కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్: మదాసి, మదారి కురుబ రిజర్వేషన్ పోరాట సమితి మండల అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.బి.పెద్దయ్య తెలిపారు. శనివారం స్థానిక బీరప్పస్వామి ఆలయంలో సమావేశం జరిగింది. మండల కన్వీనర్‌గా కొమ్మే లింగమూర్తి, కోకన్వీనర్లుగా కడియాల శివ, రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శిగా మధుతో పాటు సహాయ కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలియజేశారు.

తప్పులు లేని జాబితా సిద్ధం చేయండి

పుట్లూరు: ఓటరు జాబితా మార్పులు, చేర్పుల కోసం క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత వయస్సు ఉన్న యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు మరణించిన వారి పేర్లను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

భర్త, అత్తమామలపై కేసు నమోదు

యాడికి: వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త, అత్తామామలపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఐదేళ్ల క్రితం ఒంగోలు జిల్లా మరిపూడి మండలం శివరాయునిపేటకు చెందిన శైలజకు యాడికి మండలం చింతలాయపల్లెకు చెందిన ఈశ్వరరెడ్డి, వరలక్ష్మి దంపతుల కుమారుడు మహేశ్వర రెడ్డితో వివాహమైంది. అప్పట్లో శైలజ తల్లిదండ్రులు మహేశ్వరరెడ్డికి కట్న కానుకల కింద 7 తులాల బంగారు ఇచ్చారు. మూడేళ్ల క్రితం శైలజకు కూతురు పుట్టడంతో అదనంగా రూ.2 లక్షలు తీసుకురావాలని వేధించేవారు. దీంతో ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా మహేశ్వర రెడ్డి తన భార్య శైలజకు కూతురు పుట్టిన ఏడాదే ఆమె చెల్లెలు చిట్టిని కూడా వివాహం చేసుకున్నాడని, ఆమెకు కూడా కూతురు పుట్టడంతో ఇళ్లు విడిచి పోయి తెలంగాణలో మరో మహిళతో ఉంటున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు : కండ్లగూడూరులో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఆర్థికసమస్యలతో సతమతమవుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు.

క్రషర్‌లో పడి కార్మికుడికి తీవ్రగాయాలు

తాడిపత్రి: గుజిరీ ప్లాస్టిక్ వస్తువులను క్రష్ చేసే యంత్రంలో ప్రమాదవశాత్తు పడి ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..చుక్కలూరు రోడ్‌లో ఉన్న గుజిరీ షాపులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేష్ శనివారం సాయంత్రం క్రషింగ్ యంత్రంలో ప్లాస్టిక్ వేస్ట్‌ను క్రష్ చేస్తుండగా యంత్రంలో కాళ్లు ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు అతడిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ కౌలురైతు గుర్తింపు కార్డులు

గార్లదిన్నె: మండలంలో అర్హులైన కౌలు రైతులందరికీ కౌలురైతు కార్డులు ఇస్తామని ఏడీఏ రవి పేర్కొన్నారు. శనివారం మర్తాడు ఆర్బీకేని ఏడీ పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీ మాట్లాడుతూ పీఎం కిసాన్ డబ్బు పొందాలంటే రైతులు ఖచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 986 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. భూమి కౌలుకు తీసుకున్న ప్రతి రైతు రెవెన్యూ అధికారుల నుంచి గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఏఓ సోమశేఖర్ ఉన్నారు.

వర్షపు నీటి సంరక్షణపై అవగాహన

గుత్తి రూరల్: కరిడికొండ ఆర్బీకేలో వర్షపునీటి సంరక్షణపై శనివారం అనంతపురం ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్.నటరాజ్, డాక్టర్.శ్రీనివాసులు, రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.సహదేవరెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన కంది, సజ్జ, వేరుశనగ, ఆముదం పంటలు బెట్ట తట్టుకోవాలంటే ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. అనంతరం రైతులకు కరిడికొండ, బాచుపల్లి, వన్నేదొడ్డి గ్రామాల రైతులకు భూసార పరీక్షలకు సంబంధించిన ప్రమాణపత్రాలను అందజేశారు. వీహెచ్ఏ అజేయుడు, ఉప సర్పంచ్ ఆనంద్‌రాముడు పాల్గొన్నారు.